విలేకరులు కావలెను
మెదక్ టుడే తెలుగు దినపత్రిక,జ్వాల తెలుగు న్యూస్ చానల్‌లో పనిచేయుటకు,తెలంగాణ, ఏపీలో నియోజకవర్గ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను
వివరాలకు సంప్రదించండి
సి.హెచ్ శివ కుమార్
9494117870,
9553335493

RNI NO,TELTEL/2023/88524

# మెదక్ టుడే

తెలుగు దినపత్రిక MEDAK TODAY

మంగళవారం, నవంబర్ 12 2024 | మెదక్ | పేజీలు :4 | వెల రూ.:2 | ఎడిటర్: సిహెచ్. శివకుమార్ | సంపుటి 02 | సంచిక 37

## తెలంగాణ ఏమీ కోల్పోలేదు



- ఓ నలుగురి ఉద్యోగాలు మాత్రమే పోయాయి
- కెసిఆర్ వ్యాఖ్యలపై సిఎం రేవంత్ సెటైర్లు
- ఏఎంవీఐలకు నియామక పత్రాల అందజేత



**హైదరాబాద్,నవంబర్11:** గత ప్రభుత్వ పెద్దలు నిరుద్యోగుల గురించి ఎప్పుడూ ఆలోచించ లేదని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. తెలంగాణ ఏమీ కలోపోలేదని, ఓ కుటుంబంలో నలుగురు ఉద్యోగాలు కోల్పోయారని పరోక్షంగా కెసిఆర్‌ను ఉద్దేశించి ఎద్దేవా చేశారు. ఖైరతాబాద్‌లో ఏఎంవీఐలకు నియామక పత్రాల అందజేత కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగాల కోసం నిరుద్యోగులు

మిగతా 2లో...

## పంటలు బాగా పండిన అమ్ముకోలేని స్థితి

**అసలు రాష్ట్రంలో ప్రభుత్వం ఉందా : హరీశ్‌రావు**



**హైదరాబాద్, నవంబర్ 11 :** రాష్ట్రంలో పంటలను మద్దతు ధరలకు అమ్ముకోలేని స్థితి నెలకొందని, కాంగ్రెస్ ప్రభుత్వం తీరుతో రైతులకు శాపంగా మారిందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఎక్స్ వేదికగా మండిపడ్డారు. అకాల వర్షాలతో దిగుబడి తగ్గి ఇప్పటికే నష్టపోయిన పత్తి రైతులకు, కొనుగోళ్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం చూపుతున్న నిర్లక్ష్యం శాపంగా మారడం శోచనీయమన్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను కనీస మద్దతు ధరకు కూడా అమ్ముకోలేని దుస్థితికి తెలంగాణ రైతాంగాన్ని చేర్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. సీసీఐ, రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా పత్తి కొనుగోలు చేయబోమని రాష్ట్ర జిన్నింగ్, మిల్లుల యాజమాన్యాలు ప్రకటిస్తే సమస్యకు పరిష్కారం చూపే కనీస ప్రయత్నం చేయకపోవడం సిగ్గుచేటని మండిపడ్డారు.పత్తి రైతులు రోడ్లెక్కి లబోదిబోమంటుంటే అసలు రాష్ట్రంలో ప్రభుత్వం ఉన్నట్లా.. లేనట్లా అని ప్రశ్నించారు. రాష్ట్ర మార్కెటింగ్ శాఖ అలసత్వం, సమన్వయ లోపంతో పత్తి రైతులు చిత్తవుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారన్నారు. పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఫోటోలకు ఫోజులిచ్చిన మంత్రులు ఎందుకు మౌనంగా ఉన్నారని నిలదీశారు. పంట చేతికి వచ్చిన ఈ సమయంలో రైతుల జీవితాలతో


మిగతా 3లో...

## సుప్రీం చీఫ్ జస్టిస్‌గా సంజీవ్ ఖన్నా ప్రమాణం

**ప్రమాణం చేయించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము**
**హాజరైన ప్రధాని మోడీ, రాజ్‌నాథ్ సింగ్ తదితరులు**



**న్యూఢిల్లీ,నవంబర్11:** భారతదేశ 51వ ప్రధాన న్యాయమూర్తిగాజస్టిస్ సంజీవ్ ఖన్నా ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో జస్టిస్ సంజీవ్ ఖన్నాతో.. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రమాణ స్వీకారం చేయించారు.. సీజేఐగా జస్టిస్ డి.వై.చంద్రచూడ్ పదవీకాలం ముగిసింది. దీంతో జస్టిస్ డి.వై.చంద్రచూడ్ తర్వాత దేశ అత్యున్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ ఖన్నా సోమవారం ప్రమాణం చేశారు. జస్టిస్ సంజీవ్ ఖన్నా ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్,



ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖర్, మాజీ సీజేఐ డీవై చంద్రచూడ్ తదితరులు పాల్గొన్నారు. బాధ్యతలు స్వీకరిస్తున్న జస్టిస్ సంజీవ్ ఖన్నా.. వచ్చే ఏడాది 2025 మే 13 వరకు సీజేఐగా కొనసాగుతారు. 2019 జనవరి నుంచి సుప్రీంకోర్టులో న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ సంజీవ్ ఖన్నాఈ ఆరేళ్ల కాలంలో 117 తీర్పులు రాశారు. 456 తీర్పుల్లో సభ్యుడిగా భాగస్వాములయ్యారు. ఈవీఎంల నిబద్ధతను సమర్థిస్తూ కీలకమైన తీర్పు వెలువరించారు. ఎన్నికల బాండ్ల పథకం రద్దు, అధికరణం 370 రద్దును సమర్థిస్తూ తీర్పులు ఇచ్చిన ధర్మాసనాల్లో భాగస్వామిగా ఉన్నారు.

మిగతా 3లో...



## నేడు ఢిల్లీకి సిఎం రేవంత్

**- కాంగ్రెస్ అగ్రనేతలతో భేటీ**

**హైదరాబాద్,నవంబర్11:**తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోసారి ఢిల్లీ బాట పట్టనున్నారు. మంగళవారం ఉదయం హైదరాబాద్ నుంచి ఆయన ఢిల్లీ బయలుదేరి వెళ్లనున్నారు. అందులో భాగంగా దేశ రాజధాని ఢిల్లీలోని ఏఐసీసీ పెద్దలతో ఆయన సమావేశం కానున్నట్లు తెలుస్తోంది. తెలంగాణలో చోటు చేసుకుంటున్న రాజకీయ పరిణామాలను ఏఐసీసీ ముఖ్య నేతలకు సీఎం రేవంత్ వివరించనున్నట్లు సమాచారం. మరోవైపు సీఎం రేవంత్ మళ్లీ హస్తినకు పయనం కావడం రాష్ట్ర రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రంలో త్వరలో ఎమ్మెల్సీ ఎన్నికలు షెడ్యూల్ విడుదల కానుంది. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ ఢిల్లీ టూర్.. రాష్ట్ర పార్టీ నేతల్లో తీవ్ర ఆసక్తికరంగా మారింది.

## 14 న ఎల్.బీ స్టేడియంలో ప్రజా విజయోత్సవాల ప్రారంభోత్సవం

**- 14 వేల మంది పాఠశాల విద్యార్థులచే సమావేశం**



**హైదరాబాద్,నవంబర్11:** రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడి ఒక సంవత్సరం పూర్తి అయిన నేపథ్యంలో నిర్వహించనున్న ప్రజాపాలన విజయోత్సవాల ప్రారంభ కార్యక్రమాన్ని మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రు జయంతి బాలల దినోత్సవం సందర్భంగా ఈనెల ఈ నెల 14 వ తేదీన ఎల్.బీ స్టేడియంలో నిర్వహించనున్నారు. దాదాపు 14 వేల మంది పాఠశాల విద్యార్థులతో విద్యా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి వెల్లడించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా హాజరయ్యే ఈ కార్యక్రమంలో ఈ సంవత్సర కాలంలో విద్యార్థుల కోసం చేసిన గణనీయమైన మార్పులు, డైట్ చార్జీల పెంపు, రాష్ట్రంలోని

మిగతా 3లో...

## వికారాబాద్ జిల్లాలో తీవ్ర ఉద్రిక్తత

**- కలెక్టర్ పై చేయి చేసుకున్న మహిళ, వాహనాలు ధ్వంసం**

వివరాలు 4లో

## కాంగ్రెస్‌ను అధికారంలోకి తేవడంలో మైనార్టీలే కీలకం

**జాతీయ విద్యాదినోత్సవంలో సిఎం రేంవత్ రెడ్డి**



**హైదరాబాద్,నవంబర్11:** రాష్ట్రంలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడంలో మైనారిటీలు కీలక పాత్ర పోషించారని, హిందూ, ముస్లింలు తెలంగాణ ప్రభుత్వానికి రెండు కళ్లలాంటి వారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. మీరంతా అండగా ఉంటే విద్య, వైద్యం, ఉపాధి విషయంలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపించుకుందామని అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో జాతీయ విద్యా దినోత్సవం, మైనార్టీ సంక్షేమ దినోత్సవ వేడుకలు

మిగతా 3లో...

## చేతకానప్పుడు హామీలు ఎందుకివ్వాలి

**- అడ్డగోలు నిర్ణయాలతో రైతులు ఆగం అవుతున్నారు**
**- ఏడాది పాలనలో ఏం లాభం లేదు : కేటీఆర్**



**హైదరాబాద్, నవంబర్ 11 :** ఎన్నికల్లో గెలవాలనే ఉద్దేశంతో చేతకాని హామీలు ఇచ్చారని, కానీ ఇప్పుడు అవి అమలు చేయాలంటే సీఎం రేవంత్‌కు తలపానం తొకకు వస్తుందని మాజీ మంత్రి కేటీఆర్ ఎద్దేవా చేశారు. చేతకానప్పుడు అసలు హామీలు ఎందుకివ్వాలని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పెట్టుబడి సాయం ఎగ్గొట్టడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. చేతకాని హామీలు ఇవ్వడమెందుకు, అధికారంలోకి వచ్చాక చేతులెత్తేయడం

మిగతా 3లో...

మెదక్ టుడే
తెలుగు దినపత్రిక
మంగళవారం, నవంబర్ 12 2024

# ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య



**(మెదక్ ప్రతినిధి)నవంబర్,11, మెదక్ టుడే న్యూస్:** అనారోగ్యంతో బాధపడుతూ ఏ పని చేయలేక కుటుంబ పోషణ ఇబ్బందికరంగా మారి ఉరివేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని పొమ్లా తండాలో చోటు చేసుకుంది.ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం వివరాలు.ధాక్యాతండా పరిధి లోని పొమ్లా తండాకు చెందిన మునావత్ పోమ్లా(38)కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు.గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ కూలీ పనులు చేయలేకపోయాడు. కుటుంబాన్ని పోషించడం కోసం చిన్న చిన్న అప్పులు చేసి కుటుంబ పోషణ కోసం దిగులు చెందుతుండేవాడు.ఆదివారం సాయంత్రం ఇంట్లో నుండి బయటకు వెళ్లి తండా శివారులోని రోడ్డు పక్కన ఉన్న ఓ చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకు న్నాడు.అర్ధరాత్రి దాటిన తరువాత అటుగా వెళ్లిన తండా వాసులు చెట్టుకు ఉరి వేసుకొని ఉన్న అతన్ని గమనించి కుటుంబీకులకు సమాచారం అందించారు. పోలీసులకు ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆసుపత్రికి తరలించారు.భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా పిర్యాదిదారుల నుండి ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా అదనపు ఎస్.పి. అడ్మిన్ మహేందర్




**(మెదక్ ప్రతినిధి)నవంబర్, 11,మెదక్ టుడే న్యూస్:** సోమవారంమెదక్ జిల్లా పోలీస్ ప్రధానకార్యాలయంలో జిల్లా ఎస్.పి. శ్రీ.డి.ఉదయ్ కుమార్ రెడ్డి ఐ.పి.ఎస్. ఆదేశానుసారం జిల్లా అదనపు ఎస్.పి. అడ్మిన్ శ్రీ. ఎస్. మహేందర్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబందిత అధికారులకు పలు సూచనలు చేయడమైనది. సోమవారం నాడు ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత స్టేషన్ ల యొక్క ఎస్ఐ మరియు సిఐ లకు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య స్థితిని మరియు పరిష్కారానికి సూచనలు చేయడం జరిగింది. ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవల్ని వినియోగించుకుంటూ, వారి వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకొనేల, పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని తెలియజేశారు.ప్రజా సమస్యలు పై ఫిర్యాదులు నేరుగా స్వీకరిస్తూ ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం ద్వారా సమస్యలు పరిష్కారిస్తున్నాము అని తెలియజేశారు.

**(మొదటి పేజీ తరువాయి)**

## తెలంగాణ ఏమీ కోల్పోలేదు

గతంలో ప్రత్యేక తెలంగాణ ఉద్యమ బాట పట్టారని గుర్తుచేశారు. తెలంగాణ ఉద్యమ పోరాట నేపథ్యమే ఉద్యోగాలని అన్నారు. సొంత రాష్ట్రంలో జాబ్ నోటిఫికేషన్లు వస్తాయని వారు ఆశించారన్నారు. కానీ గత పదేళ్లలో నిరుద్యోగులను దగా చేశారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 50 వేల ఉద్యోగ నియామకపత్రాలు అందించామన్నారు. నియామకాల పక్రియ త్వరగా చేపట్టేలా పర్యవేక్షించామని వివరించారు. నిరుద్యోగుల కు నియామక పత్రాలు అందించడం నాకు సంతృప్తిని ఇస్తుందని అంటూ.. గత పాలకులు వాళ్ల ఉద్యోగాల గురించి మాత్రమే ఆలోచించారని మండిపడ్డారు. వారే తెలంగాణ ఎంతోకోల్పోయిందని అంటున్నారని మండిపడ్డారు. కొందరు డ్రగ్స్ తీసుకుంటూ దొరికినా మమ్మల్ని పట్టుకోవద్దని దబాయిస్తున్నారు. ప్రజా ప్రతినిధులు ప్రజలకు ఆదర్శంగా ఉండాల్సింది పోయి ఇలాంటి దగుల్బాజీ పనులు చేస్తే ఎలా అన్నారు. ఫామ్‌హౌస్‌లో కొందరు మద్యం తాగి దీపావళి చేసుకుంటున్నారు. 10 నెలల్లో ఏం కోల్పోయిందో ప్రజలు తెలుసుకున్నారని ఒక పెద్దాయన అంటున్నారు. తెలంగాణ ఏం కోల్పోలేదు.. పెద్దాయన ఇంట్లో నలుగురు ఉద్యోగాలు కోల్పోయారు. చిచ్చుబుడ్లకు బదులు సారా బుడ్లతో కొందరు దీపావళి చేసుకున్నారు.గత ప్రభుత్వం రెసిడెన్షియల్ స్కూల్ ఒక్కటైనా కట్టిందా? అలాంటి స్కూల్ నిర్మించలేదు కానీ.. ఆయన మాత్రం 10 ఎకరాల్లో ఫామ్ హౌస్ కట్టుకున్నారు. 2011లో రాష్ట్రంలో చివరిసారిగా గ్రూప్-1 పరీక్ష నిర్వహించారు. సుమారు 13 ఏళ్ల పాటు నిర్వహించలేదు. ఎన్ని ఆటంకాలు ఎదురైనా పట్టుబట్టి గ్రూప్-1 పరీక్షలు నిర్వహించాను. త్వరలో నియామక పత్రాలు అందజేస్తాను. అసెంబ్లీకి వచ్చి సమస్యలపై చర్చించడం ప్రతిపక్ష నేత బాధ్యత. ఆయన అసెంబ్లీకి రావాలని మేం అడుక్కోవాల్సిన పరిస్థితి ఉందని రేవంత్‌రెడ్డి ఎద్దేవా చేశారు. అలాంటి వ్యక్తి ఇవాళ బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ ఏం కోల్పోయిందో ప్రజలు గుర్తించాని అన్నారు. ఇకపోతే..నెలకొక సారి అయినా ఉన్నత ఉద్యోగంలో ఉన్నవాళ్లు స్వంత ఊర్లకు వెళ్లాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. వెనుకబడ్డ వారి సమస్యలు అడిగి తెలుసుకోండని.. స్ఫూర్తి కలిగించండన్నారు. 'లీడర్ అంటే లీడ్ చేసే వాడు. కానీ గృహ ప్రవేశాలు అంటూ దావత్ లు చేసుకుంటున్నామని బయటకు చెప్తున్నారు. పోలీస్, రవాణా శాఖ వాళ్ళకి సూచిస్తున్న..నిన్న ఒక పెద్దయన చాలాకాలం తర్వాత బయటకి వచ్చి, జనం నష్ట పోయారు అంటాడు. నష్ట పోయింది మీ 4 నలుగురుకి ఉద్యోగం పోయింది అది మాత్రమే నష్టం. కోట్ల మంది మహిళలు మహాలక్ష్మి పథకం వినియోగించుకుని మహిళలు బస్సులు ఎక్కుతున్నారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం 10 లక్షలు వినియోగించుకుంటూ వైద్యం చేసుకుంటున్నారు.' అని సీఎం వ్యాఖ్యానించారు. 500 రూపాయలకు గ్యాస్ అందిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కొత్తగా ఎంపికైన ఏఎమ్‌వీఐలు సామాజిక బాధ్యత తీసుకుని స్థానిక పాఠశాలల్లో విద్యార్థుల వద్దకు వెళ్లి చదువుకుంటే కలిగే ప్రయోజనాలను వివరించాలని సూచించారు. 500 రూపాయలకు గ్యాస్ అందిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కొత్తగా ఎంపికైన ఏఎమ్‌వీఐలు సామాజిక బాధ్యత తీసుకుని స్థానిక పాఠశాలల్లో విద్యార్థుల వద్దకు వెళ్లి చదువుకుంటే కలిగే ప్రయోజనాలను వివరించాలని సూచించారు. పక్క రాష్ట్రాల నుంచి ఇతర ప్రాంతాల నుంచి గంజాయి రవాణాను అడ్డుకోవడం లో రవాణా శాఖ కీలక పాత్ర పోషిస్తుంది. గ్రూప్ 1 పరీక్షలను 12 ఏళ్లుగా నిర్వహించలేదు. మా ప్రభుత్వం వచ్చిన తర్వాత 563 మందికి నోటిఫికేషన్ ఇచ్చాం అన్నారు.బడి దొంగలను చూశాం.. కానీ అసెంబ్లీకి రాని వారిని చూడలేదు. రెండవ సారి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రెండవ విడత జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు ఇస్తాం.' అని సీఎం తెలిపారు. పక్క రాష్ట్రాల నుంచి ఇతర ప్రాంతాల నుంచి గంజాయి రవాణా ను అడ్డుకోవడంలో రవాణా శాఖ కీలక పాత్ర పోషిస్తుంది.

## ప్రతి పేదవారు ఉన్నత విద్యను అభ్యసించాలని భావించి,దానికి అనుగుణంగా విద్యా సంస్థలను ఏర్పాటు చేసిన భారత తొలి విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని అదనపు కలెక్టర్ మెంచు నగేష్






**(మెదక్ ప్రతినిధి)నవంబర్,11, మెదక్ టుడే న్యూస్:** సోమవారం మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈకార్యక్రమానికి అదనపు కలెక్టర్ నగేష్, సంబంధిత ఇతర శాఖల అధికారులు మైనారిటీ పెద్దలతో కలిసి అదనపు కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన గావించి మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ,భారతదేశంలో సాహిత్యం, విద్య వికాసాలకొరకు చిరస్మరణీయ కృషి చేసిన వ్యక్తిగా, చరిత్రపుటలకెక్కిన మహనీయుడు మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ అని కొనియాడారు.సోమవారంఆదేశభక్తుని జయంతి సందర్భంగా విద్యారంగంలో శాస్త్ర, సాంకేతిక, స్త్రీ విద్యాభివృద్ధికి ఆయన చేసిన సేవలను స్మరించుకోవాలని చెప్పారు.స్వాతంత్ర్య సమరయోధుడు, పాత్రికేయుడు, పండితుడు మరియు కవిగా ఆయన చేసిన కృషికి గుర్తింపుగా 1992లో మరణానంతరం అతనికి భారతరత్న పురస్కారం లభించిందిఅన్నారు.హిందూ-ముస్లిం ఐక్యత కోసం పోరాడిన అతను స్వతంత్ర భారతదేశానికి మొదటి విద్యా మంత్రిగా పనిచేశాడు అని వివరించారు.జాతీయ విద్య దినోత్సవంశుభాకాంక్షలు,విద్య నేర్చుకో విలువ పెంచుకో ఈ ప్రపంచాన్నే మార్చగలిగే శక్తి విద్యకు మాత్రమే ఉందన్నారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా భారత దేశంలో ప్రతి సంవత్సరం నవంబర్ 11న జాతీయ విద్యా దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి,జమ్లా నాయక్ ఏవో యూనిస్,జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిఆర్డిఏ పిడి శ్రీనివాసరావు,బీసీ సంక్షేమ అధికారి నాగరాజుగౌడ్, ఇంటర్మీడియట్ అధికారి జి మాధవి, గిరిజన సంక్షేమ అధికారి,సంబంధిత ఇతర శాఖల అధికారులు, మైనారిటీ సంక్షేమ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సమగ్రాభివృద్ధికి తొలి మెట్టు వలెసామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ మరియు కుల సమగ్ర సర్వే ఉపయోగపడుతుందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**(మెదక్ ప్రతినిధి)నవంబర్,11, మెదక్ టుడే న్యూస్:** సోమవారం పెద్ద శంకరంపేట్ మండల కేంద్రంలో కుటుంబ సమాచార సేకరణ సర్వే ప్రక్రియ ను జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పరిశీలించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రగతి ప్రణాళికల రూపకల్పనకు జరుగుతున్న సర్వేలో ఎన్యూమరేటర్లు సేకరించిన డేటా ఎంట్రీ పగడ్బందీగా నిర్వహిస్తున్నామని తెలిపారు. సర్వే మెటీరియల్ పటిష్ట భద్రతకై ట్రంక్ పెట్టెల్లో భద్రపరచాలని ఆదేశించారు. డేటా ఎంట్రీ నమోదు చాలా సీక్రెట్ గా జరగాలని, నమోదు చేసే సమయంలో ఇతరులను అనుమతించొద్దని పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించాలని సూచించారు.సర్వే టైం బాండ్ ప్రోగ్రామని వేగం పెంచాలని స్పష్టం చేశారు.ఎలాంటి పొరపాటుకు తావులేకుండా కుటుంబం యొక్క సమగ్ర సమాచారాన్ని నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. సర్వే సమగ్రాభివృద్ధికి తొలి మెట్టు అని, దీని ద్వారా అరులైన ప్రజలకు ఏది అవసరమో, ఎలా అమలు చేయాలనే అంశాలపై ప్రణాళికలు రూపకల్పన జరుగుతుందని అన్నారు.ప్రణాళికలు లేకుండా అభివృద్ధి సాధ్యం కాదని ప్రజలు సర్వే సిబ్బందికి కుటుంబ సమగ్ర సమాచారం ఇవ్వాలని సూచించారు. జిల్లాలో కుటుం బాల వారీగా ప్రజల ఆర్థిక స్థితిగతులు తదితర అంశాలన్నింటినీ సమగ్రంగా సేకరించే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఎంతో ఆలోచన చేసి ప్రతిష్టాత్మకంగా సర్వే చేపట్టినట్లు తెలిపారు. జిల్లా తద్వారా రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ఈ సర్వే ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలలో ముమ్మరంగా సర్వే జరుగుతున్నట్లు తెలిపారు. సర్వే నిర్వహణ తీరును సూపర్ వైజర్లు, మండల నోడల్ అధికారులు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, జిల్లా నోడల్ అధికారి పర్యవేక్షణ చేయనున్నట్లు తెలిపారు. ప్రతి ఎన్యుమరేటర్ రోజుకు పది ఇళ్లను సర్వే చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించినట్లు తెలిపారు. ఎన్యుమరేటరుకు క్షేత్రస్థాయిలో ఇబ్బందులు తలెత్తకుండా సర్వే కిట్లు అందించామని బుక్ లెట్ లో ఇచ్చిన కోడ్స్ నమోదులో ఎలాంటి పొరపాట్లుకు తావులేకుండా పకడ్బందీగా వ్రాయాలని సూచించారు. రోజువారీగా జరిగిన సర్వే వివరాలను ఎంపీడీఓ కార్యాలయంలో ఆన్లైన్ చేయనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఇందుకోసం ప్రతి మండలానికి అవసరమైన డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించామని తెలిపారు.ప్రజలు ఇచ్చిన వివరాలను ఇతరులెవరికీ ఇవ్వమని,ఆధారాలు చూపించాలని,ఎన్యుమరేటర్లు ప్రజలు పట్ల భాధ్యతగా వ్యవహరిస్తారని ప్రజలు స్వచ్ఛందంగా తమ సమాచారమందించాలని ఆయనసూచించారు.ఈకార్యక్రమంలో సంబంధిత అధికారులు ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.

# సమన్వయంతో పరీక్షను విజయవంతంగా పూర్తి చేయాలి

### గ్రూప్-పరీక్ష నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు - అభ్యర్థులు పరీక్ష కేంద్రాన్ని ముందే చూసుకోవాలి,అదనపు కలెక్టర్ నగేష్






**(మెదక్ ప్రతినిధి)నవంబర్,11, మెదక్ టుడే న్యూస్:** అధికారులందరూ సమన్వయంతో గ్రూప్-111 పరీక్షను విజయవంతంగా పూర్తి చేసేలా చూడాలని అదనపు కలెక్టర్ నగేష్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 17,18 వ తేదీన నిర్వహించే గ్రూప్-111 పరీక్షపై సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని మీటింగ్ హాల్ లో జిల్లా అడిషనల్ ఎస్పీ మహేందర్, తో కలిసిఅదనపు కలెక్టర్ నగేష్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ,ఈ నెల 17,18 వ తేదీలలో ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంట వరకు , మధ్యాహ్నం 03.00 గంటల నుండి సాయంత్రం-5-30 కొనసాగే గ్రూప్-111 పరీక్షకు జిల్లాలో 5867 మంది అభ్యర్థులు హాజరు కానున్నారని తెలిపారు. అభ్యర్థుల సంఖ్యకు అనుగుణంగా జిల్లాలో 19 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ -06, రూట్ ఆఫీసర్స్ -06, డిపార్ట్మెంట్ ఆఫీసర్స్ -19, విధులు నిర్వహిస్తారని తెలిపారు.కేవలం చీఫ్ సూపరింటెండెంట్ మినహా ఎవరూ పరీక్ష కేంద్రంలోకి మొబైల్ ఫోన్ తీసుకెళ్లవద్దని స్పష్టం చేశారు. ప్రతి కేంద్రంలో మహిళలు, పురుషులకు వేరువేరుగా తనిఖీ గదులు ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ, పరిసర ప్రాంతాల్లోని జిరాక్స్ సెంటర్ లను మూసి ఉంచాలని, ఆర్టీసీ అధికారులు అభ్యర్థుల సంఖ్యకు అనుగుణంగా బస్సులు నడిపించాలని, సెస్ అధికారులు విద్యుత్ సరఫరాలో లోపం లేకుండా ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పరీక్ష కేంద్రాల వద్ద వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులు ఉండాలని సూచించారు. అదేవిధంగా ప్రతి పరీక్షా కేంద్రం వద్ద మంచినీరు, టాయిలెట్లు సక్రమంగా ఉండేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు.అడిషనల్ ఎస్పీ మహేందర్ మాట్లాడుతూ గ్రూప్ -111 పరీక్షను జిల్లాలో పగడ్బందీగా నిర్వహించడానికి పోలీస్ నోడల్ ఆఫీసర్ గా విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 19 పరీక్షా కేంద్రాలకు గాను 16 లొకేషన్స్ ఏర్పాటు చేసినట్లు మెదక్ సబ్ డివిజన్-12 పరీక్షా కేంద్రాలు నిర్వహించగా, తూప్రాన్ సబ్ డివిజన్లో -07సెంటర్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.పరీక్షా పేపర్లు భద్రపరచేందుకు స్ట్రాంగ్ రూము ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పరీక్ష నిర్వహణకు పటిష్టమైన ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు.ఒక్కో సెంటర్ కు( 05) మంది పోలీసు బందోబస్తు ఏర్పాటుచేసి అందరి సమన్వయంతో పటిష్ట భద్రత నడుమ పరీక్షలు విజయవంతంగా కొనసాగడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.సమావేశంలో మెదక్ ఆర్డీవో రమాదేవి, ఆర్డీఓ నర్సాపూర్ మహిపాల్ రెడ్డి, తూప్రాన్ ఆర్డీవో జై చంద్రారెడ్డి, జడ్పీ సీఈఓ ఎల్లయ్య డి ఆర్ డి ఓ పి డి శ్రీనివాస రావు, పలువురు జిల్లా అధికారులు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.అభ్యర్థులకు సూచనలు, పరీక్షా సమయా నికి గంటన్నర ముందునుంచే అభ్యర్థుల్ని హాల్లోకి అనుమతిస్తారు. పరీక్షకు అరగంట ముందే గేట్లు మూసివేస్తారు.అభ్యర్థులు కేవలం చెప్పులు ధరించాలి. బూట్లు వేసుకుని రాకూడదు.బయోమెట్రిక్ తప్పనిసరి,పరీక్ష కేంద్రంలో ప్రవేశించిన అభ్యర్థి నుంచి బయో మెట్రిక్ వేలిముద్రలు సేకరిస్తారు. బయోమెట్రిక్ పూర్తయ్యేవరకు అభ్యర్థులెవరూ పరీక్ష కేంద్రం నుంచి బయటకు వెళ్లడానికి వీల్లేదు. అభ్యర్థుల సౌకర్యార్థం అరగంట కోసారి బెల్ మోగించి పరీక్ష సమయాన్ని తెలియజేస్తారు. అవసరమైతే ఇన్విజిలేటర్లను అడిగి సమయం తెలుసుకోవచ్చు. అభ్యర్థులు పరీక్ష ముగిసేవరకు పరీక్ష కేంద్రాన్ని విడిచి వెళ్లకూడదు అని వివరించారు.



## అధికారులు జవాబీదారుగా పని చేయాలి

### ప్రజావాణిలో 65 దరఖాస్తులు స్వీకరణ - రానున్న ప్రజావాణిలో ఏ ఏ శాఖ వద్ద ఎన్ని దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయో తెలుపాలి,అదనపు కలెక్టర్ నగేష్

**(మెదక్ ప్రతినిధి)నవంబర్,11, మెదక్ టుడే న్యూస్:** అధికారులు జవాబీదారుగా విధులు నిర్వహించాలని అదనపు కలెక్టర్ నగేష్ పేర్కొన్నారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో ప్రజల నుంచి అదనపు కలెక్టర్ 65 దరఖాస్తులు స్వీకరించారు.అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడారు. రానున్న ప్రజావాణిలో ఏ ఏ శాఖ వద్ద ఎన్ని దరఖాస్తులు పెండింగ్ లో ఉన్నాయో తెలుపాలని ఆదేశించారు.ఆయా శాఖలకు వచ్చిన దరఖాస్తులుధరణి 17, డబల్ బెడ్ రూమ్ ఇండ్లు-04 , ఇతర సమస్యలు 44ఈ ప్రజావాణి కార్యక్రమంలో జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డి ఆర్ డి ఓ పి డి శ్రీనివాసరావు వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

(మొదటి పేజీ తరువాయి)

## పంటలు బాగా పండిన

చెలగాటమాడటం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. మిల్లుల వద్దకు చేరిన పత్తి లారీల లోడ్లతో రైతులు ఎన్ని రోజులు ఎదురుచూడాలన్నారు. పక్క రాష్ట్రాల ఎన్నికల ప్రచారాల్లో పాల్గొనడానికి సమయం ఉన్న ముఖ్యమంత్రి, మంత్రులకు రైతుల సమస్యలు పట్టించుకునే సమయం లేదా అని అడిగారు. తేమ శాతం సడలింపు, కొత్త నిబంధనల విషయమై ఢిల్లీకి వెళ్లి సీసీఐ అధికారులకు విజ్ఞప్తి చేసే తీరిక లేదా అని నిలదీశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే మొద్దునిద్ర వీడి తేమ శాతం సహా ఇతర నిబంధనల విషయంలో కేంద్రంపై, ఒత్తిడి తేవాలని, అన్ని కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు జరిగేలా చూడాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నాం అంటూ హరీశ్‌రావు ఎక్స్‌లో పోస్టు చేశారు.

## 14 న ఎల్.బీ స్టేడియంలో ప్రజా విజయోత్సవాల ప్రారంభోత్సవం

జనవరి 18, 2019న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందిన జస్టిస్ ఖన్నా ఆరు నెలల పదవీకాలం తర్వాత మే 13, 2025న పదవీ విరమణ చేయ నున్నారు. ఏ హైకోర్టుకైనా ప్రధాన న్యాయమూర్తి కాకముందే సుప్రీంకోర్టుకు పదోన్నతి పొందిన అతికొద్ది మంది న్యాయమూర్తులలో ఆయన ఒకరు. ఢిల్లీ యూనివర్సిటీలో న్యాయవిద్యను అభ్యసించిన జస్టిస్ సంజీవ్ ఖన్నా.. 1983లో ఢిల్లీ బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించారు. ట్యాక్సేషన్, ఆర్బిట్రేషన్, కమర్షియల్, కంపెనీ లా కేసులు వాదించారు.

## చేతకానప్పుడు హామీలు ఎందుకివ్వాలి

ఎందుకని ప్రశ్నించారు. అడ్డగోలు నిర్ణయాలతో అన్నదాతను ఆగం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంతోషంగా సాగిన వ్యవసాయాన్ని సంక్షోభంగా మార్చారని విమర్శించారు. నిన్న వానాకాలం రైతుబంధు ఎగ్గొట్టారు, నేడు యాసంగి పెట్టుబడి సాయానికి పాతరేస్తారట అని ఫైరయ్యారు. దగా పాలనకు ఏడాది పూర్తవుతున్న సందర్భంగా రైతులకు రేవంత్ ఇచ్చే రిటర్న్ గిఫ్ట్ ఇదేనా అని నిలదీశారు. కాంగ్రెస్ పాలనలో ఇంతకంటే దిక్కుమాలిన ఆలోచన ఇంకొకటి ఉంటదా అని విమర్శించారు. రేవంత్ ఏడాది ఏలికలో తెలంగాణ రైతుకు గోస తప్ప భరోసా లేనే లేదని ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఎవరేంటో మరోసారి తేలిపోయిందని చెప్పారు.

## కాంగ్రెస్‌ను అధికారంలోకి తేవడంలో మైనార్టీలే కీలకం

జరిగాయి... ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఉన్నవి రెండే పరివార్లు అని, ఒకటి మోదీ పరివార్, రెండోది గాంధీ పరివార్ అని అన్నారు. ప్రజల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టేందుకు మోదీ పరివార్ పనిచేస్తోందని, దేశ సమైక్యతకు గాంధీ పరివార్ కృషి చేస్తోందని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. దేశ ప్రజలకు మెరుగైన విద్య అందించేందుకు ఆనాడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఎడ్యుకేషన్ పాలసీని తీసుకొచ్చారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ముస్లింలను మేము ఓటర్లుగా చూడటంలేదని, సోదరులుగా, కుటుంబ సభ్యులుగా భావిస్తున్నామని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క మైనారిటీని కూడా ఎమ్మెల్యేగా గెలిపించుకోలేదని, అందుకే మైనారిటీ మంత్రి ఇచ్చే అవకాశం లేకుండా పోయిందన్నారు. కానీ షబ్బీర్ అలీని ప్రభుత్వ సలహాదారులుగా చేసామని, అమీర్ అలీ ఖాన్‌కు ఎమ్మెల్సీ ఇచ్చామని, కార్పొరేషన్ పదవులు ఇచ్చామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి తరువాత ఇప్పటి వరకు సీఎంవోలో మైనారిటీ అధికారిని నియమించలేదని, మన ప్రభుత్వంలో సీఎంవోలో ఒక మైనారిటీ అధికారిని నియమించామని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. దేశంలో మైనారిటీలకు ముఖ్యమంత్రులుగా, మంత్రులుగా కాంగ్రెస్ పార్టీ అవకాశం ఇచ్చిందన్నారు. మోదీ పరివార్‌తో ఉండాలో.. గాంధీ






పరివార్‌తో ఉండాలో మీరే నిర్ణయించుకోండన్నారు. మహారాష్ట్రలో కాంగ్రెస్ అధికారంలోకి తీసుకొచ్చేందుకు మైనారిటీలు కృషి చేయాలని పిలుపిచ్చారు. దేశంలో కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని, మహారాష్ట్రలో మహావికాస్ అగాడి కూటమిని అధికారంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేయాలన్నారు. దేశంలో మోదీని ఓడించి రాహుల్ గాంధీని ప్రధానిగా చూసే వరకు విశ్రమించొద్దని సీఎం రేవంత్ రెడ్డి పిలుపిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గతంలో వైఎస్సార్ ప్రభుత్వం 4శాతం రిజర్వేషన్లు ఇచ్చిందని అన్నారు. వాటిని తొలగించేందుకు బీజేపీ కుట్ర పన్నిందని ఆరోపించారు.మోదీ వర్గం గెలిస్తే మైనార్టీలకు రక్షణ ఉండదని అన్నారు. ప్రస్తుతం ఎన్నికలు జరుగుతున్న మహారాష్ట్ర, జార్ఖండ్?లో ఉన్న స్నేహితులకు, బంధువులకు కాంగ్రెస్‌ను గెలిపించాలని చెప్పాలని కోరారు. మోసాల బజారులో ప్రేమ దుకాణం తెరిచేందుకే రాహుల్ గాంధీ కన్యకుమారి నుంచి కాశ్మీర్ వరకు భారత్ జోడో యాత్ర చేశారని చెప్పారు. ఈ సందర్భంగా చార్మినార్ వద్ద జాతీయ జెండా ఎగురవేసి, హిందూ, ముస్లిం భాయి భాయి అని చాటారని చెప్పారు. అప్పుడు మాజీ ప్రధాని దివంగత రాజీవ్ గాంధీ కూడా సద్భావన యాత్ర సందర్భంగా చార్మినార్ వద్ద జెండా ఎగరవేశారని గుర్తు చేశారు. గాంధీ కుటుంబం భారతదేశంలోని అన్ని వర్గాలను కలుపుకొని పోతుందని అన్నారు. ప్రాంతీయ పార్టీల ముసుగులో షేర్వానీ వేసుకొని మీ మధ్య కూర్చొని బిర్యానీ తిన్నవాళ్లను నమ్మొద్దంటూ పరోక్షంగా కేసీఆర్‌ను ఉద్దేశించి విమర్శలు చేశారు. ఇక్కడ గెలిచిన వాళ్లు ఢిల్లీ వెళ్లి మోదీకి మద్దతు ఇస్తున్నారని చెప్పారు. ప్రస్తుతం మహారాష్ట్ర, జార్ఖండ్‌లో కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వాలు గెలువాలని అన్నారు.

# షుగర్ ఎంత ఉన్నా సరే.. ఈ నీళ్లను తాగితే దెబ్బకు తగ్గిపోతుంది..!

**హైదరాబాద్ :** రోజూ ఉదయాన్నే పరగడుపునే కరివేపాకు నీళ్లను తాగడం వల్ల ఎన్నో ఆరోగ్యకరమైన ప్రయోజనాలను పొందవచ్చు. ఈ నీళ్లను తాగితే మనం అన్ని విధాలుగా ఆరోగ్యంగా ఉంటాం. ఈ నీళ్లలో అనేక పోషకాలు, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఈ నీళ్లు ఔషధ గుణాలను కలిగి ఉంటాయి. అందువల్ల ఉదయం పరగడుపునే కరివేపాకు నీళ్లను తాగడం వల్ల జీర్ణక్రియ మెరుగు పడుతుంది. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. శిరోజాలు, చర్మం ఆరోగ్యంగా ఉంటాయి. రోజూ ఉదయం కరివేపాకు నీళ్లను తాగడం వల్ల అనేక లాభాలను పొందవచ్చని ఆయుర్వేద వైద్య నిపుణులు చెబుతున్నారు.జీర్ణ వ్యవస్థకు..కరివేపాకులను నీటిలో వేసి మరిగించి ఆ నీళ్లను రోజూ ఉదయం ఒక కప్పు మోతాదులో తాగుతుండాలి. దీని వల్ల జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. జీర్ణశక్తి పెరుగుతుంది. ఈ నీళ్లను తాగడం వల్ల జీర్ణాశయ ఎంజైమ్‌లు ఉత్పత్తి సక్రమంగా ఉంటుంది. దీంతో తిన్న ఆహారం సులభంగా జీర్ణమవుతుంది. అలాగే కడుపు ఉబ్బరం, గ్యాస్ సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చు. పొట్టలో ఏర్పడే అసౌకర్యం కూడా తగ్గుతుంది. కరివేపాకుల నీళ్లను తాగడం వల్ల జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది.బరువు తగ్గేందుకు.అధిక బరువు తగ్గాలని చూస్తున్నవారికి ఈ నీళ్లు వరమనే చెప్పవచ్చు. ఈ నీళ్లను తాగడం వల్ల శరీర మెటబాలిం



మెరుగు పడుతుంది. దీంతో క్యాలరీలు వేగంగా ఖర్చవుతాయి. ఫలితంగా కొవ్వు కరుగుతుంది. దీంతో అధిక బరువు తగ్గుతారు. కనుక బరువు తగ్గాలని చూస్తున్నవారు ఈ నీళ్లను తప్పనిసరిగా తాగాల్సి ఉంటుంది. ఈ నీళ్లను తాగితే బరువు నియంత్రణలో ఉంటుంది. అలాగే రోజంతా ఉత్సాహంగా ఉంటారు. శక్తిస్థాయిలు పెరుగుతాయి. ఎంత పనిచేసినా అసలు అలసిపోరు.చర్మ సంరక్షణ.కరివేపాకుల్లో యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. దీంతో చర్మం కాంతి సహజసిద్ధంగా పెరుగుతుంది. చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. రోజూ కరివేపాకుల నీళ్లను తాగడం వల్ల చర్మంపై ఏర్పడే వృద్ధాప్య ఛాయలు సైతం తగ్గుతాయి. దీంతో ముఖంపై ముడతలు ఉండవు. చర్మం యవ్వనంగా కనిపిస్తుంది. మొటిమలు, మచ్చలు కూడా తగ్గుతాయి. చర్మం తన సహజసిద్ధమైన నిగారింపును సొంతం చేసుకుంటుంది. చర్మ సమస్యలు ఉన్నవారు కరివేపాకుల నీళ్లను రోజూ తాగుతుంటే ఫలితం ఉంటుంది.షుగర్ తగ్గేందుకు.జుట్టు రాలే సమస్య ఎక్కువగా ఉన్నవారు రోజూ కరివేపాకుల నీళ్లను తాగుతుండాలి. దీంతో జుట్టు కుదుళ్ల నుంచి దృఢంగా పెరుగుతుంది. పొడవుగా ఉంటుంది. జుట్టు రాలడం తగ్గుతుంది. ఇన్‌ఫెక్షన్లు, దురద, చుండ్రు నుంచి సైతం ఉపశమనం లభిస్తుంది. శిరోజాలు కాంతివంతంగా మారి ప్రకాశిస్తాయి. షుగర్ లెవల్స్ అధికంగా ఉన్నవారు కరివేపాకు నీళ్లను రోజూ తాగితే ఎంతో ఫలితం ఉంటుంది. డయాబెటిస్ సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చు. షుగర్‌ను తగ్గించడంలో కరివేపాకులు అద్భుతంగా పనిచేస్తాయి. డయాబెటిస్ పేషెంట్లు వీటిని ఆహారంలో భాగం చేసుకోవాలి. లేదా రోజూ కరివేపాకులతో నీళ్లను పెట్టుకుని తాగవచ్చు. ఎలా తీసుకున్నా షుగర్ లెవల్స్ కంట్రోల్ అవుతాయి. ఇలా కరవేపాకుల నీళ్లను తాగడం వల్ల అద్భుతమైన ప్రయోజనాలను పొందవచ్చని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. కాబట్టి వీటిని తాగండి.

# మారుతి సెడాన్ న్యూ డిజైర్ లాంచింగ్..

## రూ.6.79 లక్షల నుంచి ప్రారంభం..!

**హైదరాబాద్ :**ప్రముఖ కార్ల తయారీ సంస్థ మారుతి సుజుకి తన ఫోర్త్ జనరేషన్ సెడాన్ డిజైర్ సోమవారం ఆవిష్కరించింది. కంపాక్ట్ సెడాన్ క్యాటగిరీలో హాట్ కేక్ లా అమ్ముడు పోతోందీ డిజైర్. ఈ నేపథ్యంలో డిజైర్ ఫీచర్లు మరింత డెవలప్ చేసి మార్కెట్లోకి తీసుకొచ్చింది మారుతి సుజుకి. భారతీయ కస్టమర్ల అవస౯రాలకు అనుగుణంగా డిజైన్, సేఫ్టీ, టెక్నాలజీ, పవర్ ట్రైన్, కంఫర్ట్, సేఫ్టీ, స్టైల్‌గా రూపుదిద్దుకున్నదీ డిజైర్. ఈ కారు ధర సుమారు. 6.79 లక్షల (ఎక్స్ షోరూమ్) నుంచి ప్రారంభం అవుతుంది. రూ.11 వేలు చెల్లించి ప్రీ బుకింగ్ చేసుకోవచ్చునని గత వారమే మారుతి సుజుకి తెలిపింది. గ్లోబల్ ఎన్-క్యాప్ క్రాష్ టెస్ట్‌లో 5-స్టార్ రేటింగ్ అడల్ట్ , చైల్డ్ ఆక్యుపెంట్ సేఫ్టీలో 4-స్టార్ రేటింగ్ కలిగి ఉంటుందీ కారు. మారుతి సుజుకి కార్లలో ఈ రేటింగ్ పొందిన తొలి కారు ఇది. హొండా అమేజ్, హ్యుండాయ్ ఔరా, టాటా టైగోర్ వంటి కార్లకు గట్టి పోటీ ఇస్తుంది. సెడాన్ కార్ల సెగ్మెంట్‌లో 50 శాతం వాటా కలిగి ఉంటుందీ డిజైర్.అర్బన్ డ్రైవింగ్ సూటబుల్ గా ఉంటుందీ మారుతి డిజైర్. గ్లాస్ బ్లాక్ ట్రిమ్, ప్రీమియం టచ్‌తో క్రోమ్ ఫినిష్డ్ బాటం లైన్, డ్యుయల్ టోన్ డాష్ బోర్డు విత్



స్పేసియస్ లే ఔట్, ఆపిల్ కార్ ప్లే, ఆండ్రాయిడ్ ఆటోకు మద్దతుగా 9- అంగుళాల ఫ్లోటింగ్ టచ్ స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్ ఉంటుంది. సెమీ డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్ తోపాటు కనెక్టెడ్ కార్ టెక్నాలజీ ఉంటుంది. సింగిల్ పేన్ ఎలక్ట్రిక్ సన్ రూఫ్, రేర్ ఏసీ వెంట్స్, రేర్ సెంటర్ ఆర్మ్ రెస్ట్, 360- డిగ్రీ కెమెరా ఫర్ ఎన్‌హాన్స్ డ్ విజిబిలిటీ అండ్ సేఫ్టీ తదితర ఫీచర్లు ఉంటాయి.సేఫ్టీ కోసం మారుతి సుజుకి డిజైర్ కారులో సమగ్ర రక్షణ కోసం సిక్స్ ఎయిర్ బ్యాగ్స్, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ ప్రోగ్రామ్ (ఈఎస్పీ), హిల్ హోల్డ్ అసిస్ట్, యాంటీ లాక్ బ్రేకింగ్ సిస్టమ్ (ఏబీఎస్) విత్ ఎలక్ట్రానిక్ బ్రేక్ ఫోర్స్ డిస్ట్రిబ్యూసన్ (ఈబీడీ), అన్ని సీట్లకూ త్రీ-పాయింట్ సీట్ బెల్ట్స్, ఐఎస్ఓఎఫ్ఐఎక్స్ చైల్డ్ సీట్ యాంకర్స్ ఉంటాయి. న్యూ డిజైర్ కారు తాజా మారుతి జడ్- సిరీస్ 1.2 లీటర్ల 3- సిలిండర్, నేచురల్లీ ఆస్పిరేటెడ్ పెట్రోల్ ఇంజిన్ తో వస్తోంది. గరిష్టగా 82 హెచ్పీ విద్యుత్, 112 ఎన్ఎం టార్క్ వెలువరిస్తుంది. 5-స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్ మిషన్, ఏఎంటీ ఆప్షన్లలో లభిస్తుంది. న్యూ డిజైర్ కారుపై సబ్ స్క్రిప్షన్ మోడల్ కూడా అందుబాటులో ఉంది. నెలకు రూ.18,248 చొప్పున చెల్లించి సబ్ స్క్రిప్షన్ చేసుకోవాలి. ఇందులో కారు ధర, రిజిస్ట్రేషన్, మెయింటెనెన్స్, ఇన్సూరెన్స్, రోడ్ సైడ్ అసిస్టెన్స్ తదితర ఆప్షన్లు అందుబాటులో ఉంటాయి.పెట్రోల్ వేరియంట్ (ఎక్స్ షోరూమ్ ధరలు)ఎల్ఎక్స్ఐ మాన్యువల్ : రూ.6,79,000వీఎక్స్ఐ మాను య్వల్ : రూ.7,79,000జడ్ఎక్స్ఐ మాన్యువల్ : రూ.8,89 ,000జడ్ఎక్స్ఐంమాన్యువల్: రూ.9,69,000వీఎక్స్ ఏజీఎస్ (ఆటో గేర్ షిఫ్ట్): రూ.8,24,000జడ్ఎక్స్ఐ ఏజీఎస్: రూ.9,34,000జడ్ఎక్స్ఐ ం ఏజీఎస్ : రూ.10,14,000

# కేటీఆర్ ఎవరి కాళ్లు మొక్కడానికి ఢిల్లీ వెళ్లారో తెలుసు, మంత్రి పొంగులేటి సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్ :**కటీఆర్ ఢిల్లీలో ఎవరి కాళ్లు మొక్కడానికి వెళ్లారో మాకు తెలుసని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సీఎం, కేబినెట్ అనుమతి లేకుండా ఫార్ములా-ఈ రేసింగ్ సంస్థకు రూ.55 కోట్లు కేటీఆర్ ఏ విధంగా మళ్లించారని ప్రశ్నించారు. కేటీఆర్ ఎవరి కాళ్లు మొక్కడానికి ఢిల్లీ వెళ్లారో తెలుసు, మంత్రి పొంగులేటి సంచలన వ్యాఖ్యలు"కేటీఆర్ ఎక్కడున్నారు? ఎందుకు ఢిల్లీకి వెళ్లారు? ఎవరి కాళ్లు మొక్కి ఏం లబ్ధి పొందుదామని వెళ్లారు? లిక్కర్ స్కాం కేసులో కేంద్ర పెద్దలను ఒప్పించి తన చెల్లి బెయిల్ పొందినట్లుగానే తనను తాను కాపాడుకోవడానికి కేటీఆర్ మళ్లీ ఢిల్లీ వెళ్లారు?" అని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఖమ్మం రూరల్ మండలం చిన్న వెంకటగిరి మంత్రి పొంగులేటి కేటీఆర్ ను ఉద్దేశించి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఫార్ములా - ఈ రేసింగ్ నిర్వహణకు విదేశాల్లోని సంస్థలకు రూ.55 కోట్లను ఏవిధంగా మళ్లించారని మంత్రి ప్రశ్నించారు. కేబినేట్ అప్రూవల్, ముఖ్యమంత్రి అప్రూవల్ లేకుండా కేటీఆర్ విదేశాల్లోని తొత్తు సంస్థలకు నిధులు మళ్లించారని దుయ్యబట్టారు.ఫార్ములా - ఈ రేసింగ్ నిర్వహణలో నిధుల దుర్వినియోగం అంశంపై విచారణను రాష్ట్ర ప్రభుత్వం ఏసీబీకి అప్పగించిందని తెలిపారు. ఫార్ములా - ఈ రేసింగ్ నిర్వహణకు సంబంధించిన కంపెనీతో %మీాఖ% కుదుర్చుకోకమునుపే కేటీఆర్ నిధులను మళ్లించారని విమర్శించారు. ఎవరి అనుమతి తీసుకోకుండా ఎవరి కోసం రూ. 55 కోట్ల ప్రజా ధనాన్ని మళ్లించారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. ఒక ప్రజా ప్రతినిధిని అదుపులోకి తీసుకుని విచారించాలంటే దర్యాప్తు సంస్థలకు గవర్నర్ అనుమతి ఉండాలని, అందుకే ముందస్తుగా ఏసీబీ అనుమతి కోరినట్లు పేర్కొన్నారు. రేపో మాపో గవర్నర్ అనుమతి వస్తుందని ముందే గ్రహించిన కేటీఆర్ హైదరాబాద్ నుంచి ఢిల్లీకి తన బేస్ క్యాంప్ మార్చారన్నారు.మా దగ్గర ఆధారాలున్నాయిఅంబానీ, అదానీ, ఆర్ఎస్ఎస్, బీజేపీ పెద్దలను కలిసి తనను ఫార్ములా - ఈ రేసింగ్ కేసు నుంచి తప్పించాలని ప్రాధేయపడేందుకే కేటీఆర్ ఢిల్లీకి వెళ్లారని దుయ్యబట్టారు.అందుకు సంబంధించిన అన్ని ఆధారాలు తమ దగ్గర ఉన్నాయని పొంగులేటి స్పష్టం చేశారు. "నేను పేల్చబోయే బాంబేంటో కేటీఆర్ కు తెలుసు.. గత ప్రభుత్వం పదేళ్ల హయాంలో చేసిన అవినీతి బాగోతాన్ని వెలికితీస్తే భూమి మీద నుంచి అంతరిక్షంకు వెళ్లి దాక్కునేలా ఉన్నారు." అని పొంగులేటి ఎద్దేవా చేశారు. కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రిని కలిసి తనపై కేసు కాకుండా చూడాలని కేటీఆర్ ప్రాధేయపడుతున్నారని పేర్కొన్నారు. అసలు కేటీఆర్ కు ఆయనతో పనేంటని ప్రశ్నించారు. ఏడేడు లోకాల ఆవల ఉన్నా చట్టం కేటీఆర్ ను వదిలిపెట్టదని వ్యాఖ్యానించారు

# ఎన్టీఆర్ స్టేడియంలో కోటి దీపోత్సవానికి టీజీఎస్ఆర్టీసీ ప్రత్యేక బస్సులు, ఏ డిపో నుంచి ఎన్నంటే?

**హైదరాబాద్ :**హైదరాబాద్ ఎన్టీఆర్ స్టేడియం జరిగే కోటి దిపోత్సవం కోసం టీజీఎస్ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది. ప్రతి రోజు సాయంత్రం 5 నుంచి రాత్రి 10 గంటల వరకు నగరంలోని పలు ప్రాంతాల నుంచి ఎన్టీఆర్ స్టేడియానికి ప్రత్యేక సర్వీసులు నడపనున్నారు.
ఎన్టీఆర్ స్టేడియంలో కోటి దీపోత్సవానికి టీజీఎస్ఆర్టీసీ ప్రత్యేక బస్సులు, ఏ డిపో ఎన్నంటే?కార్తీక మాసం సందర్భంగా హైదరాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో కోటి దీపోత్సవం నిర్వహిస్తోన్నారు. కోటి




| S.NO | DEPOT | ROUTE | TO | NO. OF BUSES |
|---|---|---|---|---|
| 1 | UPL | 113 I/M | NTR STADIUM | 8 |
| 2 | UPL | 113 K/L | NTR STADIUM | 6 |
| 3 | CNT | 20P | NTR STADIUM | 6 |
| 4 | HYT-1 | NGOs COLONY | NTR STADIUM | 2 |
| 5 | HYT-2 | NGOs COLONY | NTR STADIUM | 2 |
| 6 | DSNR | DILSUKNAGAR | NTR STADIUM | 4 |
| 7 | HPT | ALWAL | NTR STADIUM | 4 |
| 8 | KP | KPHB | NTR STADIUM | 4 |
| 9 | MP | MEHDIPATNAM | NTR STADIUM | 4 |
| 10 | KC | ECIL | NTR STADIUM | 4 |
| 11 | JDM | JEEDIMETLA | NTR STADIUM | 4 |
| 12 | MDCL | MEDCHAL | NTR STADIUM | 4 |
| 13 | MDN | LAB QUARTERS | NTR STADIUM | 4 |
| 14 | IBP | IBRAHIMPATNAM | NTR STADIUM | 4 |
| 15 | HCU | LINGAMPALLY | NTR STADIUM | 4 |
| 16 | RJNR | SHAMSHABAD | NTR STADIUM | 4 |
| 17 | KCG | KOTI | NTR STADIUM | 4 |
| 18 | BDG | L B NAGAR | NTR STADIUM | 4 |

దిపోత్సవానికి వెళ్లే భక్తుల కోసం టీజీఎస్ఆర్టీసీ స్పెషల్ బస్సులను నడుపుతోంది. ఈ నెల 25వ తేదీ వరకు సిటీలోని పలు ప్రాంతాల నుంచి ప్రతి రోజు సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తెలిపారు. బస్సులకు సంబంధించిన పూర్తి వివరాల కోసం కోఠి బస్ స్టేషన్‌లో 9959226160, రేతిఫైల్ బస్ స్టేషన్‌లో 9959226154 ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చు. కోటి దీపోత్సవం కార్యక్రమానికి అంచనా.

# వికారాబాద్ జిల్లాలో తీవ్ర ఉద్రిక్తత- కలెక్టర్ పై చేయి చేసుకున్న మహిళ, వాహనాలు ధ్వంసం

**హైదరాబాద్ :**వికారాబాద్ జిల్లాలో ఉద్రిక్తత నెలకొంది. దుద్యాల మండలం లగచర్లలో స్థానికులు కలెక్టర్ ప్రతీక్ జైన్, ఇతర అధికారుల వాహనాలపై రాళ్లు, కర్రలతో దాడి చేశారు. ఫార్మా విలేజ్ భూసేకరణపై చర్చించేందుకు కలెక్టర్, తహసీల్దార్ లగచర్ల గ్రామానికి వెళ్లారు. ఫార్మా విలేజ్ వద్దంటూ..కలెక్టర్ గో బ్యాక్ అంటూ రైతులు, స్థానికులు ఆందోళనలు చేపట్టారు. కలెక్టర్ ప్రతీక్ జైన్ ప్రజలను వారించేందుకు ప్రయత్నించారు. ఒక్కసారిగా కలెక్టర్ వైపు దూసుకొచ్చిన గ్రామస్థులు.. ఆయనపై దాడికి పాల్పడ్డారు. కలెక్టర్ కారులో ఎక్కి అక్కడి నుంచి వెళ్తుండగా పలువురు రాళ్లతో కార్లపై దాడి చేశారు. కలెక్టర్ కారు అద్దాలు ధ్వంసం చేశారు. అయితే అంతకు ముందు గ్రామానికి 2 కి.మీ. దూరంలో అధికారులు గ్రామసభ ఏర్పాటు చేశారు. గ్రామస్థుల తరఫున ఓ వ్యక్తి కలెక్టర్ వద్దకు వచ్చి గ్రామంలో సభ ఏర్పాటుచేశాయని చెప్పాడు. దీంతో కలెక్టర్, అధికారులు గ్రామానికి వెళ్లగా... గ్రామస్థులు కలెక్టర్ ను అడ్డుకుని వారి వాహనాలపై రాళ్ల దాడి చేశారు. రాళ్ల దాడిలో పలువురు అధికారులు గాయపడ్డారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో గ్రామంలో పోలీసులను



మోహరించారు.కాడా అధికారిపై దాడిసీఎం రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గంలో కలెక్టర్ పై దాడి జరిగింది. కలెక్టర్, అధికారులపై రాళ్లు, కర్రలతో రైతులు, గ్రామస్థులు దాడికి పాల్పడ్డారు.వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ పై ఓ మహిళ చేయి చేసుకున్నట్లు సమాచారం. కొడంగల్ ఏరియా డెవలప్ మెంట్ అథారిటీ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డిపై గ్రామస్థుల దాడి చేశారు. ఫార్మా కంపెనీ ఏర్పాటుపై గ్రామస్థుల అభిప్రాయ సేకరణకు వచ్చిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఇతర అధికారుల వాహనాలపై రాళ్లతో రైతుల దాడి చేశారు. మూడు వాహనాలు ధ్వంసం చేశారు. పరిస్థితి ఉద్రికత్తంగా మారడంతో భారీగా పోలీసులను మోహరించారు. దుద్యాల, లగచర్ల పోలేపల్లి, లగచర్ల తాండలో ఫార్మా కంపెనీల ఏర్పాటుపై రైతులతో చర్చించేందుకు కలెక్టర్, అధికారులు వచ్చారు.కలెక్టర్ కు సీఎస్ ఫోన్దాడిపై సమాచారం అందుకున్న పోలీసులు.. వెంటనే అక్కడికి చేరుకుని ఆందోళనకారులను చెదరగొట్టారు. ప్రస్తుతం గ్రామంలో భారీగా పోలీసులు మోహరించారు. దాడి అనంతరం వికా రాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ కలెక్టరేట్ కు చేరుకున్నారు. కలెక్టర్ క్యాంపు ఆఫీసులో అధికారులతో మాట్లాడారు. దాడి ఘటనపై వికారాబాద్ జిల్లా కలెక్టర్తో సీఎస్ శాంతికుమారి ఫోన్ లో మాట్లాడారు. దుద్యాలలో జరిగిన దాడి ఘటనపై వివ రాలు అడిగి తెలుసుకున్నారు.కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలు తిర గబడ్డారని బీజేపీ, బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి సొంత నియోజకర్గమైన కొడంగల్ లో కలెక్టర్ పై దాడి చేశారన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వ ఒం టెద్దు పోకడలు, నియంత విధివిధానాలు నచ్చక కలెక్టర్ పై, ప్రభుత్వాధికారులపై కర్రలతో, రాళ్లతో దాడి చేశాయి.


# కంటైనర్‌లో మంటలు.. 8 కార్లు దగ్ధం.. రూ.2 కోట్ల నష్టం

**హైదరాబాద్ :**జహీరాబాద్ పోలీసుల కథనం ప్రకారం.. ముంబయి నుండి 8 టాటా నెక్సాన్ కార్లను కంటైనర్‌లో హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. ఆ వాహనం జహీరాబాద్ లోని రంజోల్ సమీపంలో 65వ నంబర్ జాతీయ రహదారిపైకి వచ్చింది. ప్రమాదవశాత్తు కంటైనెర్‌లో మంటలు చెలరేగాయి. గమనించిన డ్రైవర్ వాహనాన్ని పక్కకు ఆపాడు. మంటలను ఆర్పే ప్రయత్నం చేశాడు. కానీ ఫలితం దక్కలేదు. మంటలు వ్యాపించి డ్రైవర్ ఒంటికి అంటుకొని గాయాలయ్యాయి. డ్రైవర్ సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.
రోడ్డుపై వెళ్తున్న వాహనదారులు అప్రమత్తమై పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. హుటాహుటిన జహీరాబాద్ పోలీసులు, అగ్ని మాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని, మంటలను ఆర్పడానికి ప్రయత్నం చేశారు. అప్పటికే కంటైనర్‌లో తరలిస్తున్న కార్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. కంటైనర్ కాలిపోయింది. ఈ ఘటనతో ముంబయి- హైదరాబాద్ హైవే పైన ఆర గంటకు పైగా రాకపోకలు నిలిచిపోయాయి. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.రూ. 2 కోట్లకు పైగా నష్టం..సాంకేతిక సమస్యతో కంటైనర్‌లో మంటలు చెలరేగి ఉండవచ్చని కంపెనీ అధికారులు అనుమానిస్తున్నారు. కంటైనర్‌లో తరలిస్తున్న 8 కార్లు పూర్తిగా కాలిపోయాయి. రూ. 2 కోట్ల పైనే ఆస్తి నష్టం జరిగినట్లు సంబంధిత కంపెనీ అధికారులు వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో కంటైనర్ డ్రైవర్ కూడా గాయాల పాలయ్యాడు. అతనికి ప్రథమ చికిత్స అందించిన తర్వాత, సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని పోలీసులు వివరించారు.
మెదక్‌లో..గొనె సంచుల గోదాములో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. రూ. 3 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లింది. ఈ ఘటన మెదక్ జిల్లాలో జరిగింది. నిజాంపేట మండల



కేంద్రంలోని జిట్టి చంద్రశేఖర్‌కు చెందిన గొనె సంచుల గోదాములో మంటలు చెలరేగాయి. స్థానికులు యజమానికి సమాచారం అందించారు. అతడు వెంటనే అగ్ని మాపక సిబ్బందికి అందించారు. అగ్నిమాపక సిబ్బంది చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనలో గొనె సంచులు, వ్యాపారి అమ్మకానికి తీసుకొచ్చిన చీరలు, గాజులు పూర్తిగా కాలిపోయాయి. రూ. 3 నుంచి 4 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయారు.

# గుడ్‌న్యూస్.. ఏదైనా డిగ్రీతో బ్యాంక్ జాబ్.. జీతం రూ.29 వేలు..




**హైదరాబాద్ :** ఐడీబీఐ బ్యాంక్ నిరుద్యోగులకు శుభవార్త చెప్పింది. వెయ్యి పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చింది. ఏదైనా డిగ్రీతో ఉద్యోగం కల్పిస్తోంది. ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిరుద్యోగులకు గుడ్‌న్యూస్ చెప్పింది. 1000 ఎగ్జిక్యూటివ్- సేల్స్ అండ్ ఆపరేషన్స్ పోస్టులను భర్తీ చేయబోతోంది. ఏదైనా డిగ్రీ విద్యార్హతతో ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు. పరీక్ష, ఇంటర్వ్యూల ద్వారా నియామకాలు చేపడతారు. ఎంపికైన అభ్యర్థులు రెండేళ్లు పనిచేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత పనితీరు, సంస్థ అవసరాలను బట్టి.. పర్మినెంట్ ఉద్యోగంలోకి తీసుకుంటారు.పూర్తి వివరాలు..మొత్తం ఖాళీలు: 1000. దీంట్లో జనరల్ 448, ఓబీసీ 231, ఎస్సీ 127, ఎస్టీ 94, ఈడబ్ల్యుఎస్ విభాగాల్లో 100 పోస్టులు ఉన్నాయి.అర్హత: గుర్తింపు పొందిన విద్యాసంస్థ నుంచి ఏదైనా డిగ్రీలో ఉత్తీర్ణత సాధించి ఉండాలి.వయసు: అక్టోబరు 1, 2024 నాటికి 20 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి. అక్టోబరు 2, 1999 - అక్టోబరు 1, 2004 మధ్య జన్మించినవారు అర్హులు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్లు సడలింపులు ఇచ్చారు.ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: నవంబరు 16ఆన్‌లైన్ పరీక్ష తేదీ: డిసెంబరు 1వ తేదీఆన్‌లైన్ పరీక్ష కేంద్రాలు:ఆంధ్రప్రదేశ్‌లో గుంటూరు, కడప, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, ఏలూరు, ఒంగోలు, రాజమండ్రి, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం.తెలంగాణలో.. హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, ఖమ్మంలో ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహిస్తారు.అప్లికేషన్ ఫీజు: ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.250. మిగిలిన అందరికీ రూ.1050 ఫీజు ఉంటుంది.జీతం..ఎగ్జిక్యూటివ్ సేల్స్ అండ్ ఆపరేషన్స్‌లో చేరినవారికి మొదటి ఏడాది ప్రతి నెల రూ.29 వేలు ఇస్తారు. రెండో ఏడాది రూ.31 వేలు చెల్లిస్తారు. రెండేళ్ల అనంతరం బ్యాంక్ నిర్వహించే పరీక్షలో అర్హత సాధిస్తే.. పర్మినెంట్ విధుల్లోకి తీసుకుంటారు. అప్పుడు జూనియర్ అసిస్టెంట్ మేనేజర్ గ్రేడ్ ఓ హోదా కేటాయిస్తారు. అప్పుడు ఏడాదికి రూ.6.14 నుంచి రూ.6.50 లక్షలు అందుతుంది.

# చాగంటి కోటేశ్వర రావు గురించి 10 ఆసక్తికరమైన విషయాలు

**హైదరాబాద్ :**చాగంటి కోటేశ్వర రావు.. తెలుగు రాష్ట్రాల్లో పరిచయం అక్కర్లేని ప్రవచనకారుడు. ఆయన ప్రవచనాలు వినడానికి లక్షలాది మంది ఎదురుచూస్తుంటారు. విలువలకు కట్టుబడి, ఏమీ ఆశిం చకుండా ఆధ్యాత్మిక సందేశం ఇవ్వడం చాగంటి ప్రత్యేకత. చాగంటి విషయంలో ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. చాగంటికి 'స్టూడెంట్స్ ఎథిక్స్ అండ్ వా ల్యూ స్ సలహాదారుడి' గా బాధ్యతలు అప్పగించింది. ఈ నేపథ్యంలో ఆయన గురించి 10 ఆసక్తికరమైన విషయాలు ఇప్పుడు తెలుసుకుందాం. 1.చాగంటి కోటేశ్వర రావు ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఆయన భార్య వ్యవసాయశాఖలో ఉన్నతాధికారిణి. 2.చాలా ఛానెళ్లలో చాగంటి ప్రవచనాలు వినిపిస్తాయి. అవి చూస్తే చాగ ంటి ఏనాడైనా ఆఫీసుకు వెళ్తారా



అనే సందేహం వస్తుంది. కానీ చాగంటి కోటేశ్వర రావు ఆఫీసుకు ఒక్కరోజు కూడా సెలవు పెట్టరు. లేట్ పెర్మిషన్ కూడా తీసుకోరని ఆయన సహో ద్యోగులు చెబుతుంటారు. 3.చాగంటి కేవలం శని, ఆదివారాల్లో మాత్రమే ప్రవచనాలు చెబుతారు. అవి కూడా కాకినాడలోని ఒక దేవాలయంలోనే. కావాల్సిన ఛానెల్స్ వారు అక్కడికి వెళ్లి రికార్డ్ చేసుకుని ప్రసారం చేస్తుంటారు. 4.చాగంటి కోటేశ్వర రావుకు ఉన్న ప్రతిభా సంపత్తిని సొమ్ము చేసుకోవాలనుకుంటే.. ఈపాటికి వందల ఎకరాల భూములు సంపాదించేవారని.. ఆయన సన్నిహితులు చెబుతుంటారు. 5.చాగంటి ప్రవచనాలు చెప్పినందుకు నయాపైసా తీసుకోరు. ఎక్కడికైనా బయట నగరాలకు వెళ్లి ప్రవచనాలు ఇవ్వాల్సివస్తే.. తన సొంత డబ్బుతో స్లీపర్ క్లాస్ టికెట్ కొనుక్కుని ప్రయాణం చేస్తారు. నిర్వాహకులనుంచి డబ్బు తీసుకోరు. 6.చాగంటి కోటేశ్వర రావుకు ఉన్నది కేవలం రెండు పడక గదుల ఇల్లు. ఇప్పటి వరకు ఆయనకు కారు లేదు.

## తెలంగాణలో పోలీస్ శాఖ ఒక్కటే పని చేస్తున్నది! : ఎమ్మెల్యే జగదీస్ రెడ్డి

**సూర్యాపేట :** రాష్ట్రంలో సంవత్సర కాలంలోనే పరిస్థితులు అన్నీ తారుమారు అయ్యాయి. అభివృద్ధి ఆగిపోయి ప్రభుత్వ శాఖలు పడకేశాయని ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి విమర్శించారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో పోలీస్ శాఖ ఒక్కటే ప్రశ్నించే గొంతులను అణిచివేసేందుకు పని చేస్తుందన్నారు. స్కూళ్లలో పిల్లలు చనిపోతున్నారని, దవాఖానల్లో మందులు అందుబాటులో లేక డాక్టర్లు బయట నుంచి తెచ్చి వైద్యం చేస్తున్నారన్నారు.రాష్ట్రంలో కట్టించే శాఖ జాడలేదు కానీ కూలగొట్టే శాఖ మాత్రం ఉందని ఎద్దేవా చేశారు. నల్లగొండలో సినిమా సెట్టింగ్ కన్నా అధ్వానంగా పత్తి కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయ శాఖ మంత్రి ప్రారంభించినట్లు ఫొటోలకు ఫోజు ఇచ్చారు. కానీ, నేటి వరకు కొనుగోలు జరగడం లేదు. వడ్లు, పత్తి కొనుగోలు చేయకపోవడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందన్నారు. వందల కోట్ల కుంభకోణం ఉందని, అది బయట పెడతామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రంగంలోకి దిగి కొనుగోలు జరపాలని డిమాండ్ చేశారు.వికారాబాద్‌లో అధికారులపై ప్రజలు దాడి చేయడం ప్రభుత్వ పరిపాలన విధానానికి నిదర్శనమన్నారు.మోసపూరిత మాటలను ప్రజలు ప్రశ్నిస్తున్నారని వారిని భయపెట్టేందుకే ప్రభుత్వం ప్రయత్నిస్తుందని విమర్శించారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి హోదాను దిగజార్చారు. సోయ లేకుండా మాట్లాడుతూ మంత్రులు వారి నైజం బయట పెట్టుకుంటున్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు మాట్లాడుతున్న మాటలను ప్రజలు గమనిస్తున్నారని, మూసీ నీళ్లతో వాళ్ల నోర్లు బాగు చేసుకోవాలన్నారు. ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడితే బాగుంటుందన్నారు.




## మణిపూర్‌లో భారీ ఎన్‌కౌంటర్.. భద్రతా బలగాల కాల్పుల్లో 11 మంది కుకీ మిలిటెంట్లు మృతి



**ఇంఫాల్:** మణిపూర్‌లో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది.కుకీ మిలిటెంట్లు పోలీస్ స్టేషన్‌పై దాడి చేశారు. ఈ సందర్భంగా మిలిటెంట్లు, భద్రతా బలగాల మధ్య కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో 11 మంది కుకీ మిలిటెంట్లు మరణించారు. సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్పీఎఫ్) జవాన్లు కొందరు గాయపడ్డారు. అస్సాం సరిహద్దు సమీపంలోని జిరిబామ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. అనుమానిత కుకీ మిలిటెంట్లు రెండు వైపుల నుంచి జిరిబామ్‌లోని పోలీస్ స్టేషన్‌పై దాడి చేశారు. ఆ తర్వాత పోలీస్ స్టేషన్‌కు కిలోమీటరు దూరంలోని జకురాడోర్ కరోంగ్‌లోని ఇళ్లకు నిప్పు పెట్టారు. అక్కడకు చేరుకున్న భద్రతా బలగాలపై కాల్పులు జరిపారు.
కాగా, భద్రతా బలగాల ఎదురు కాల్పుల్లో 11 మంది కుకీ మిలిటెంట్లు మరణించారు. వారి నుంచి భారీగా ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కాల్పుల్లో సీఆర్పీఎఫ్‌కు చెందిన కొందరు జవాన్లు కూడా గాయపడ్డారు. వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.మరోవైపు పోలీస్ స్టేషన్ పక్కన ఉన్న నిరాశ్రయుల శిబిరం కుకీ మిలిటెంట్ల లక్ష్యం కావచ్చని భద్రతా బలగాలు అనుమానం వ్యక్తం చేశాయి. జిరిబామ్ జిల్లాలోని ఈ పోలీస్ స్టేషన్‌ను కుకీ మిలిటెంట్లు పలుసార్లు టార్గెట్ చేసినట్లు పేర్కొన్నారు.

## నాడు కేసీఆర్ విజన్‌తో చెరువులను అభివృద్ధి చేశారు : సబితా ఇంద్రారెడ్డి

**బడంగ్‌పేట,నవంబర్11 :** నాడు కేసీఆర్ తెలంగాణ రాష్ట్రంలో ఉన్న చెరువులను ఒక విజన్‌తో అభివృద్ధి చేశారని ఎమ్మెల్యే సబిత ఇంద్రారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజక వర్గంలోని అల్మాస్‌గూడ పోచ్చమ్మకుంట సుందరీకరణ పనులను సోమవారం ఆమె పరిశీలించారు. చెరువు చుట్టు తిరిగి సుందరీకరణ పనులు పూర్తి చేయడానికి ఎంత సమయం పడుతుందని అధికారులను అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ ద్వారా చెరువులలో ఉన్న పూడిక తీయించిన విషయాన్ని గుర్తు చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చెరువులు మురికి కూపాలుగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం చెరువులలో ఉన్న గుర్రపు డెక్కను తొలగించే పరిస్థితి లేదని ఆమె మండి పడ్డారు. బాలాపూర్ మండలంలోనే 42 గొలుసు కట్టు చెరువులు ఉన్నాయని ఆమె గుర్తు చేశారు. అన్ని చెరువులలోకి మురుగు నీరు వస్తుందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. పోచ్చమ్మకుంట సుందరీకరణ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆమె అధికారులకు ఆదేశించారు.



## పులివెందుల పౌరుషం ఉంటే అసెంబ్లీకి రా..

### జగన్‌కు మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సవాలు



**హైదరాబాద్ :**మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌పై ఏపీ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మండిపడ్డారు. నీతి నిజాయితీ ఉంటే, దమ్ముంటే అసెంబ్లీకి రావా లని సవాలు విసిరారు. రోడ్ల అభివృద్ధిపై బహి రంగ చర్చకు సిద్ధమని తెలిపారు. సోమవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎవరి తప్పులేంటో అసెంబ్లీలో చర్చిద్దామని అన్నారు. తప్పులు చేసినందుకే భయపడి.. జగన్ అసెంబ్లీకి రావడం లేదని విమర్శించారు.జగన్ అసెంబ్లీకి వస్తే మాట్లాడేందుకు మైక్ ఇస్తామని బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. పులివెందుల పౌరుషం ఉంటే జగన్ అసెంబ్లీకి రావాలని సవాలు విసిరారు. జగన్‌కు ప్రజలే ప్రతిపక్ష హోదా ఇవ్వలేదని అన్నారు. ప్రజలే పక్కన పెట్టినా జగన్‌కు సిగ్గురావడం లేదని మండిపడ్డారు. గత ఐదేళ్ల పాలనలో వైసీపీ విధ్వంసం సృష్టించిందని అన్నారు. దీంతో పెట్టుబడిదారులు సైతం రాష్ట్రం నుంచి వెళ్లిపోయారని అన్నారు. ఇలాగే వ్యవహరిస్తే చివరకు ఒక్క సీటు కూడా ఆ పార్టీకి రాదని జోస్యం చెప్పారు. పోర్టులపై జగన్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. సోషల్‌మీడియాలో అనుచిత పోస్టులు పెడితే ఊరుకోమని హెచ్చరించారు. తప్పు చేసినవారిని కచ్చితంగా శిక్షిస్తామని స్పష్టం చేశారు.

## స్వల్పంగా తగ్గిన బంగారం.. వెండి ధరలు..

**హైదరాబాద్ :**దేశ రాజధాని ఢిల్లీలో తులం బంగారం (24 క్యారట్స్) ధర రూ.450 తగ్గి రూ.79,550లకు దిగి వచ్చింది. అంతర్జాతీయ మార్కెట్లో బలహీనతలు దేశీయ బులియన్ మార్కెట్లోనూ కొనసాగుతున్నాయి. శుక్రవారం తులం బంగారం (24 క్యారట్స్) ధర రూ.80 వేల మార్క్ వద్ద స్థిర పడింది. మరోవైపు కిలో వెండి ధర సైతం రూ.600 తగ్గి రూ.94,000 వద్ద నిలిచింది. శుక్రవారం కిలో వెండి ధర రూ.94,600 వద్ద స్థిర పడింది. ఆభరణాల తయారీలో వినియోగించే 99.5 శాతం స్వచ్ఛత గల బంగారం తులం రూ.450 తగ్గి రూ.79,150 వద్ద నిలిచింది. శుక్రవారం 99.5 శాతం స్వచ్ఛత గల బంగారం తులం ధర రూ.79,600 పలికింది.



Printed, Published and Owned by CHILVERA SHIVAKUMAR and Printed JWAALA PRINTERS. H.NO.- 10-15/1/A, KAMMARI GAINI, MANDAL PAPANNAPETA, DISTRICT- MEDAK, TELANGANA- 502303- Gmail medaktoday89@gmail.com-cll. 9948265095.9494117870.. .
Editor: CHILVERA SHIVAKUMAR . **RNI NO,TELTEL/2023/88524** Gmail. medaktoday89@gmail.com Cell: 9948265095